# కలికాలం

నే పనిచేసే కంపెనీకి ప్రతి సోమవారం శెలవు. సోమవారం పుదయం తొమ్మిదిన్నరనించి సాయంత్రం ఆరుదాకా మిత్రులతో చతుర్ముఖ పారాయణం అలవాటయిపోయింది ఎవరికెంతెంత ఇవ్వాలో లెక్క చూసుకుని ఇచ్చి పుచ్చుకోవటాలు అయాకే స్నానంచేసేది.

"పెదనాన్న గారికోసం ఎవరో వచ్చారు" చెప్పాడు తమ్ముడు.

"పెదనాన్న గారి కోసమా? ఆయనపోయి అయిదుసంవత్సరాలు దాటిందని చెప్పు" విసుగ్గా చెప్పాను ముక్కలు కలుపుతూ.

"చెప్పాను నిన్ను పిలవమన్నాడు. ఏదో మాట్లాడాలిట" చెప్పాడు తమ్ముడు.

"ఆయన్ని పంపించి వస్తాను. ముక్కలు కలిపివుంచండి" మిత్రులకిచెప్పి ముందు గదిలోకి వెళ్ళాను.

నన్ను చూడగానే కుర్చీలోంచి లేచి నిలబడ్డాడాయన అరవై పైనే వుంటుంది ఆయన వయసు. లాల్చీ పైజామాలతో వున్నాడు, ఆయన్ని ఎప్పుడూ చూసిన గుర్తు లేదునాకు

"మా పెదనాన్నగారు పోయి ఆరేళ్ళవుతుంది" చెప్పాను ఆయనతో.

ఇప్పుడే మీ తమ్ముడు చెప్పాడు చాలా విచారిస్తున్నాను. మహానుభావుడాయన, నాలాంటివాళ్ళని తీసు కెళ్ళినా బావుండేది" ఎంతోబాధగా చెప్పాడాయన. కళ్ళనీళ్ళే తక్కువ.

"ఆయన మీకెలా తెలుసు?" అడిగాను నాలో చిరాకు తగ్గింది.

"రెవిన్యూ డిపార్ట్మెంట్లో మేంఇద్దరం కలసి పనిచేసాం"

కొద్దిసేపు సందేహించి అడిగాడు.

"ఆయన వారసులెవరు?"

"నేను తమ్ముడు ఇద్దరమే ఆయనకి సంతాన భాగ్యంలేదు." చెప్పాను.

కొదిసేపు తటపాయించి చెప్పాడు.

"మేం ఇద్దరం శ్రీకాకుళం కేంప్‌కి వెళ్ళాం. ఒకే గదిలో వారం వున్నాం. ఆఖరి రోజు ఆయన నిద్ర పోతుండగా ఇరవై రెండు రూపాయలు కొట్టేశాను" ఆగి తలవంచుకొని పూర్తి చేసాడు.

"అప్పట్లో ఆర్థికమైన ఇబ్బందులు నాకు అనేకం వుండేవి"

ఓసారి గట్టిగా వూపిరి తీసుకుని వదలి చెప్పాడాయన.

"ఆ బాకీ తీరుద్దామని వస్తే ఆయనే లేరు.... ఆ డబ్బు మీకిచ్చి ఋణ విముక్తుడిని అవుతాను"

ఆయనే లేనప్పుడు....

నా మాటలకి అడ్డుపడి జేబులోంచి వందనోటు తీసాడు.

"వారం క్రితమే నాకు త్రోట్ కేన్సర్ అని తెల్సింది. ఆ రోజు లుండను. ఇలా నేను కక్కుర్తి పడ్డ చోటికల్లా వెళ్ళి డబ్బు తిరిగి ఇచ్చేస్తున్నాను కాదనకండి"

వందరూపాయల నోటు నాచేతిలో వుంచాడు.

ఇరవై రెండు తీసుకుని మిగతా డబ్బు ఆయనకిచ్చేసాను.

"ఈ కలికాలంలోకూడా మంచివాళ్ళున్నారు" చెప్పాడు ఓ మిత్రుడు.

"మంచివాళ్ళుకాదు పాపభీతి గలవాళ్ళు" చెప్పాడు తమ్ముడు తన వాటా తీసుకుని.

మర్నాడు ఆ వంద రూపాయల నోటుకి చిల్లర తీసుకోడానికి బేంక్ కెళితే కేషియర్ దాన్ని అటూ ఇటూ తిప్పి చూసి చెప్పాడు.

"ఇది దొంగనోటు"

* *
*